



అక్షర్.. సిక్సర్!

తొలిరోజు ఆటలో అతనే హీరో

ఏసీజీలో మొదలైన క్రికెట్ పండుగ





ఫోర్‌లు.. సిక్సర్‌ల మోత మోగుతుందని.. వీలైతే తామే క్యాచ్ పట్టాలని ఉత్సాహంగా ఆర్డీటీ స్టేడియానికి వెళ్లిన క్రికెట్ క్రీడాభిమానులకు తొలిరోజు నిరాశ ఎదురైంది. బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై తొలిరోజు ఏకంగా 14 వికెట్లు కూలాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఇండియా-డి ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ మెరుపులు మెరిపించారు. 118 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 86 పరుగులు సాధించి.. ప్రేక్షకుల చేత కేకలు పెట్టించారు. ఆ తరువాత బౌలింగ్‌లోనూ సత్తాచాటి రెండు వికెట్లు కూల్చాడు. అనంత క్రీడాభిమానులు ఎంతగానో ఎదురు చూసిన దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీలు అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో(ఏసీజీ) గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 22వ తేదీ వరకూ పోటీలు కొనసాగుతాయి. టీవీల్లో తప్ప నేరుగా అంతర్జాతీయ క్రీడాకారులను, వారి ఆటను ఆస్వాదించని జిల్లా యువత.. ఎలాగైనా పాసులు సాధించి ఆటను ప్రత్యక్షంగా చూడాలని పోటీ పడుతోంది. (వివరాలు 7లో..)

వాడుకుని వదిలేశారు..!

జేఎన్‌టీయూలో తరగతులకు పనికిరాని గదులు

ఎన్నికల అవసరాలకు మార్పులు.. చేర్పులు

నష్టపోతున్న ఇంజనీరింగ్ విద్యార్థులు


ల్యాబ్‌లో అడ్డగోడను కూల్చిన దృశ్యం


ఏసీ వైర్ కట్


శుభ్రం చేస్తున్న కళాశాల సిబ్బంది


స్ట్రాంగ్ రూమ్ అలాగే..

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 5: సార్వత్రిక ఎన్నికలకు వినియోగించిన జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ విభాగం గదులు తరగతుల బోధనకు పనికిరాని విధంగా తయారయ్యాయి. ఎన్నికల సమయంలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ రూమ్‌లకు అవసరమైన విధంగా గదులను మార్చుకున్నారు. ఈ క్రమంలో కొన్ని గదుల అడ్డగోడలను కూల్చి.. విశాలంగా మార్చుకున్నారు. అవసరమైనచోట గోడలను నిర్మించుకున్నారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, సెమినార్ హాల్ తదితరాలను ఎన్నికల అవసరాలకు అనుగుణంగా మార్చుకున్నారు. గదుల్లో ఉన్న ఫర్నిచర్, పరికరాలు, యంత్రాలను వేరేచోటుకు తరలించారు. కిటికీలు, వాకిళ్లకు అడ్డుగా గోడలు కట్టారు. మరుగు దొడ్లను మూసివేశారు. ఏసీలు, ఫ్యాన్‌లు, కంప్యూటర్లకు విద్యుత్ సరఫరా లేకుండా వైర్లను కోసేశారు. ఇంటర్నెట్ వైర్లను ఎక్కడికక్కడ కోసేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి మూడు నెలలు గడిచినా ఆ గదులను మునుపటి స్థితికి తీసుకురాలేదు. దీంతో విద్యార్థులకు నష్టం జరుగుతోంది.

కళాశాలకు భారం

ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మొత్తం రెవెన్యూ శాఖ అధ్వర్యంలో జరుగుతుంది. ఎన్నికల కోసం ఈసీ రూ.కోట్లు ఖర్చు చేస్తుంది. రెవెన్యూ శాఖ పెట్టిన ఖర్చులకు బిల్లులు చెల్లిస్తుంది. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్నికల ఏర్పాట్లకు భారీగా ఖర్చు చేశారు. కానీ తరగతి గదుల పునరుద్ధరణ గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. తోచిన పనులు చేసి మమ అనిపించారు. దీంతో తరగతి గదులు, హాళ్లు, మౌలిక వసతుల పునరుద్ధరణ ఖర్చులను కాలేజీ భరించాల్సిన దుస్థితి నెలకొంది.

త్వరితగతిన చేయిస్తాం...



ఎన్నికల కౌటింగ్‌కు అనుగుణంగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో కాంట్రాక్టర్ల చేత పనులు చేయించాం. తరగతి గదులు, ల్యాబ్‌లు, సెమినార్ హాళ్లు.. ఇలా అవసరమైన భవనాలు, గదులను వినియోగించుకున్నాము. వాటిని పూర్వపుస్థితికి తీసుకువచ్చే పనులు పూర్తిచేయిస్తాం. ఇప్పటికే చాలా పనులు చేయించాము. కొద్దిశాతం పనులు ఆగిపోయాయి. వీటిని పూర్తిచేస్తేనే బోధన, ల్యాబ్‌ల నిర్వహణకు వీలవుతుందని కళాశాల అధికారులు మా దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్‌తో చర్చించి త్వరతగతిన పూర్తిచేయిస్తాం. - **రామకృష్ణారెడ్డి, డీఆర్వో**

ఆయుర్వేద ఔషధాలు సీజ్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 5: చట్ట విరుద్ధంగా మార్కెట్‌లో ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉంచిన మూడురకాల ఆయుర్వేద మందులను సీజ్ చేశామని జిల్లా డ్రగ్స్ నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న గురువారం తెలిపారు. లైంగిక సామర్థ్యం పెరుగుతుందని, మధుమేహం పూర్తిగా నియంత్రణలోకి వస్తుందని మందుల సీసాలపై ముద్రించడం చట్ట విరుద్ధమని వారు అన్నారు.

జబ్బులను నయం చేస్తామని ప్రొడక్ట్ లేబుల్‌పై ముద్రించకూడదని అన్నారు. నారాయణపురం పంచాయతీ పరిధిలోని రాఘవేంద్రకాలనీలో నిబంధనలకు విరుద్ధంగా మందులను సిద్ధం చేసుకుని, మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు ప్రయత్నించారని తెలిపారు. సమాచారం రావడంతో దాడులు చేసి, మందులను సీజ్ చేశామని అన్నారు. బాధ్యులపై కేసు నమోదు చేశామని, శాంపిల్స్‌ను పరిశీలన కోసం విజయవాడ ల్యాబ్‌కు పంపామని తెలిపారు.

విజయవాడలోనే ఎస్పీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 5: వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఎస్పీ జగదీష్ విజయవాడలోనే ఉన్నారు. జిల్లా నుంచి మంగళవారం బయలుదేరిన ఎస్పీ.. రెండు రోజులపాటు సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డీజీపీతో సమావేశం అనంతరం జిల్లాకు తిరిగి ఎప్పుడు వస్తారనే విషయంలో స్పష్టత వస్తుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

అక్కా.. వస్తావా..?

వితంతువుకు ఫీల్డ్ అసిస్టెంట్ వేధింపులు

'అక్కా.. నువ్వు పనులకు రాకపోయినా పరవాలేదు.. నా వద్దకు రా..! డబ్బు సంపాదించుకో..! నువ్వు బాగుండు.. నేనూ బాగుంటా..! నీకు బయటకు వచ్చేందుకు వీలౌతుందా..? ఇప్పుడే రూ.5 వేలు ఇస్తా..! రూ.3 లక్షలు లోన్ ఇప్పిస్తా..' అని ఓ వితంతువు పట్ల అనుచితంగా ప్రవర్తించాడు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్. శింగనమల మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు ప్రతి రాత్రీ ఫోన్ చేసి.. 'అక్కా' అంటూనే తన లైంగిక వాంఛ తీర్చాలని వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు కాల్ రికార్డింగ్ చేసి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు నిందితుడు శ్రీనివాసులు నాయుడుపై శింగనమల పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. బాధితురాలి భర్త పదేళ్ల క్రితం మృతి చెందాడు. కూలి పనులు చేసుకుంటూ ఆమె కుమారులను పోషిస్తోంది. ఆదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు నాయుడు ఆమెను కొన్నాళ్లుగా వేధిస్తున్నాడు. 'పనులకు రాకున్నా బిల్లులు ఇస్తా. డబ్బులు పడకుంటే అప్పుడు అడుగు. బాగా సంపాదించుకో. రూ.3 లక్షల లోన్‌లో నాకు రూ.లక్ష.. నీకు రూ.2 లక్షలు. ఏమంటావ్..? నీ కొడుకులను సాకాలంటే డబ్బులు కావాలి. నేను చూసుకుంటా..! నీకు నేనున్నా..! బయటకు వచ్చేందుకు వీలౌతుందా..?' అని ఆమెను పదే పదే అడిగాడు. 'నీకూ పెళ్లాం పిల్లలు ఉంటారు కదా శీనూ..? వాళ్లను ఎవరైనా ఇట్ల అడిగితే ఊరికే ఉంటావా..?' అని బాధిత మహిళ ప్రశ్నించినా.. తన తీరు మారలేదు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని సీఐ కౌలుట్లయ్య తెలిపారు. **- శింగనమల**

అంతర పంటకు సిద్ధంకండి

ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్ బాబు


పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 5: వేరుశనగ పంట తొలగించాక అంతర పంటలను సాగు చేసుకునేందుకు రైతుల సిద్ధం కావాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త విజయ్ శంకర్‌బాబు సూచించారు. రేకలకుంటలో అనంతపురం, కళ్యాణదుర్గం కేవీకే అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారులతో గురువారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వేరుశనగ, కంది పంటలకు సోకిన తెగళ్లు, సస్యరక్షణ చర్యల గురించి చర్చించారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు మెట్ట పొలాలు బాగా పదునయ్యాయని అన్నారు. వేరుశనగ కోత అనంతరం ఉలవ, జొన్న పంటలు సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని అన్నారు. కంది పంటలో వెర్రి తెగులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. రైతులు 60 రోజులు, 90 రోజులలో నీటిలో కరిగే గంధకం 600 మి.లీ., ప్రొపార్ గైట్, ఓమైట్ 400 మి.లీ. ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. రేకలకుంటలోని వేరుశనగ, కంది పంటలను శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పరిశీలించారు. నల్లరేగడి భూములలో పప్పుశనగ, పత్తి పంటల సాగు గురించి చర్చించారు. జేడీఏ ఉమామహేశ్వరమ్మ, శాస్త్రవేత్తలు గుత్తా నారాయణస్వామి, నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.

గురువే గైడ్.. ఫిలాసఫర్

■ కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్


జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 5: గురువే ప్రతి ఒక్కరికీ గైడ్, ఫిలాసఫర్ అని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజ్ డ్రామా హాల్‌లో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాణాలు కాపాడే డాక్టర్‌ను వైద్యో నారాయణో హరి అంటారని, అయితే గురువును సాక్షాత్తు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా శాస్త్రాలు పేర్కొన్నాయని అన్నారు. గురువు లేకపోతే ప్రపంచమేలేదని అన్నారు. తాను నాలుగు ఎన్నికలు చూశారని, ఎన్నికల్లో ఉపాధ్యాయులు చేసే కృషి ప్రశంసనీయమని అన్నారు. సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేకస్థానం ఉందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. విద్యార్థులను ఉన్నతస్థితికి తీసుకెళ్లే ఉపాధ్యాయులు ఉత్తమ సేవలందించాలని, వారిని సన్మానించడం సంతోషదాయకమని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయుల పట్ల చూపుతున్న గౌరవం, ఆదరణ ఆదర్శప్రాయమని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ అన్నారు. ఉపాధ్యాయులు లేనిదే ఈ సమాజం లేదని అన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని గురువులను సత్కరించుకోవడం ఆనందంగా ఉందని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. ఉపాధ్యాయులు పిల్లలకు ఉత్తమ బోధన అందించాలని జడ్పీ చైర్‌పర్సన్ గిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ సూచించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీఈఓ వరలక్ష్మి, డీవీఈఓ వెంకటరమణనాయక్, ఏపీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడిని స్పృశించిన సూర్యకిరణాలు



తాడిపత్రి, సెప్టెంబరు 5: సూర్య కిరణాలు పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామివారిని గురువారం సాయంత్రం తాకాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని అర్చకులు శంకరయ్యశర్మ తెలిపారు. భాద్రపద శుద్ధ పాఢ్యమి నుంచి పౌర్ణమి వరకు దాదాపు 15 రోజులపాటు స్వామివారిని సూర్యుడి కిరణాలు తాకుతాయి. చైత్రమాసంలో 15 రోజులు, భాద్రపద మాసంలో 15 రోజులు ఇలా జరుగుతుంది.

← స్వామివారిని తాకుతున్న సూర్యకిరణాలు








పత్రం.. పరమౌషధం

చవితి పూజలో వినియోగించే ఏకవింశతి పత్రాలన్నీ ఆరోగ్యానికి ఔషధాలే..

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 5: వినాయక చవితి భారతీయుల ప్రధాన పండుగల్లో ఒకటి. ఈ పండుగను భాద్రపద మాస శుక్ల చతుర్థి రోజున జరుపుకోవడం ఆనవాయితీ. గణేశ్ చతుర్థినాడు పూజల్లో 21 రకాల పత్రులతో గణనాథుడిని పూజిస్తుంటారు. ఇవన్నీ మహా శక్తివంతమైన దివ్య ఔషధాలు. ఈ పత్రులను వినాయక చవితి పండుగ రోజునే కాకుండా అనారోగ్య సమస్యల నివారణకూ వినియోగించుకోవచ్చును. ఈ పత్రులన్నీ ఏ అడవుల్లోనో పెరిగేవి కాదు, అన్నీ మన పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న మొక్కలే. నిమజ్జన సమయంలో ఈ పత్రులను నీటిలో వేయకుండా, వాటిని నీడలో ఆరబెట్టి పొడి చేసుకుని, మరికొన్నింటిని నీటిలో మరిగించి కషాయం తయారు చేసుకోవాలి. మనకు ఏదైనా అనారోగ్య సమస్య వచ్చినపుడు డాక్టర్ వద్దకు వెళ్లే పనిలేకుండా వాటిని సేవిస్తే అనారోగ్య సమస్యలు తొలగుతాయి. గణేశ్ చతుర్థిలో వినియోగించే 21 రకాల విశేష పత్రాల వివరాలు మీకోసం..



మాచీపత్రం (మాచిపత్రి)



ఈ మొక్క శాస్త్రీయ నామం ఆర్టీమిజియ పాలెన్స్. ఇది ఆస్టరేసి కుటుంబానికి చెందిన మొక్క. ఇది మంచి సువాసన గల పత్రి. దీనిని దద్దుర్లు, తలనొప్పి, వాత నొప్పులు, మధుమేహం, ఉబ్బసం, మూర్ఛవ్యాధుల నివారణకు వినియోగిస్తారు.

బృహతీపత్రం (వాకుడు)



ఈ మొక్క శాస్త్రీయ నామం సోలానం సూరత్రేన్స్. ఇది సొలనేసి కుటుంబానికి చెందిన మొక్క. దీనిని దగ్గు, జలుబు, జ్వరం, మూత్ర వ్యాధులు, నేత్రవ్యాధుల నివారణకు వాడతారు.

బిల్వపత్రం (మారేడు)



ఈ మొక్క శాస్త్రీయ నామం ఈదిల్ మార్మిలస్. ఇది రూటేసి కుటుంబానికి చెందినది. దీనిని జిగట విరేచనాలు, జ్వరం, మధుమేహం, కామెర్లు, నేత్రవ్యాధులు, రక్తహీనత, పగుళ్లు, గాయాలు మానేందుకు వినియోగిస్తారు.

సింధూరపత్రం (వావిలాకు)



ఈ మొక్క శాస్త్రీయ నామం వైటెక్స్ నిర్గుండో. ఇది వెర్బినేసి కుటుంబానికి చెందిన వృక్షం. కీళ్ల నొప్పుల సమస్యలున్నవారు ఈ ఆకులు వినియోగించడం వలం మంచి ఫలితం ఉంటుంది.

చూతపత్రం (మామిడి)



ఈ మొక్క శాస్త్రీయనామం మాంజిఫెరా ఇండికా. ఇది అనకార్డియేసి కుటుంబానికి చెందిన మొక్క. నోటి దుర్వాసన, చిగుళ్ల వాపు సమస్యలను మామిడాకు బాగా తగ్గిస్తుంది. మామిడిపండ్లలో బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది ఆస్తమా నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

కరివీర పత్రం (గన్నేరు)



ఈ మొక్క శాస్త్రీయ నామం నెరియం ఒలియాండర్. ఇది అపోసైనేసి కుటుంబానికి చెందిన మొక్క. గడ్డలు, పుండ్లు, గాయాలు తగ్గేందుకు ఈ మొక్క వేరు, బెరడును ఉపయోగిస్తారు.

దాడిమీపత్రం (దానిమ్మ)



ఈ మొక్క శాస్త్రీయ నామం ప్యూనిక గ్రానేటం. ఇది ప్యూనికేసి కుటుంబానికి చెందినది. వాంతులు, విరేచనాలు అరికట్టడంలో దానిమ్మ ఆకులు బాగా పనిచేస్తాయి.

జాజిపత్రం (సన్నజాజి)



ఈ మొక్క శాస్త్రీయ నామం జాస్మినం ఆరిక్యూలేటం. ఇది ఓలియేసి కుటుంబానికి చెందినది. చర్మ సమస్యలు. సంబంధిత వ్యాధులకు ఈ ఆకులు ఔషధంగా పనిచేస్తాయి.

అర్జునపత్రం (తెల్లమద్ది)



ఈ మొక్క శాస్త్రీయ నామం టెర్మినేలియా అర్జున. ఇది కాంబ్రిటేసి కుటుంబానికి చెందినది. గుండెకు రక్త ప్రసరణను సులభతరం చేయడంతోపాటు అల్సర్లు, మధుమేహం, దగ్గు, ఉబ్బసం, చర్మవ్యాధుల నివారణకు ఈ ఆకులు ఉపకరిస్తాయి.

దూర్వారయుగ్మం (గరిక)



ఈ మొక్క శాస్త్రీయ నామం సైనోడాన్ డాక్టైలాన్. ఇది పోయేసి కుటుంబానికి చెందిన మొక్క. దీనిని గాయాలు మానడానికి, చర్మవ్యాధుల నివారణకు, ఉదర, మొలల సమస్యల నివారణకు వాడతారు.

తులసీపత్రం (తులసి)



శాస్త్రీయ నామం ఆసిమం శాంక్టమ్. లామియేసి కుటుంబానికి చెందిన మొక్క. రోగ నిరోధక శక్తిని పెంచి, రక్తాన్ని శుద్ధి చేయడంతోపాటు జలుబు, దగ్గును నివారించేందుకు ఈ మొక్క ఉపకరిస్తుంది.

మరువకపత్రం (మరువం)



ఈ మొక్క శాస్త్రీయ నామం ఒరిగానం మజోరాన. ఇది లామియేసి కుటుంబానికి చెందినది. దీని ఆకులు సువాసనను వెదజల్లుతాయి. వీటి వాసన చూడడం వల్ల మనలో ఒత్తిడి వెంటనే తగ్గిస్తుంది.

దేవదారు పత్రం (దేవదారు)

ఈ మొక్క శాస్త్రీయ నామం సిడ్రస్ దియోధర. ఇది పైనేసి కుటుంబానికి చెందిన వృక్షం. వీటి ఆకులను తెచ్చి ఆరబెట్టిన తర్వాత ఆకులను నూనెలో వేసి కాచి చల్లార్చిన తర్వాత ఆ నూనెను తలకు రాసుకుంటే మెదడు, కంటి సంబంధిత వ్యాధులు దూరమవుతాయి. దేవదారు వృక్షం నుంచి తీసిన నూనె చుక్కలను వేడి నీటిలో వేసి, ఆ నీటితో స్నానం చేస్తే శ్వాస సంబంధ సమస్యలు తొలగిపోతాయి.



దత్తూర పత్రం (ఉమ్మెత్త)



ఈ మొక్క శాస్త్రీయ నామం దత్తూర ఇనోక్సియా. ఇది సొలనేసి కుటుంబానికి చెందినది. దీనిని ఉబ్బసం, దగ్గు, శ్వాసకోస సమస్యలు, చర్మవ్యాధులతోపాటు కుక్కకాటు చికిత్సకు వినియోగిస్తారు.

అపామార్గ పత్రం (ఉత్తరేణి)



ఈ మొక్క శాస్త్రీయ నామం అఖిరాంథస్ ఆస్పెరా. అమరాంథేసి కుటుంబానికి చెందిన మొక్క ఇది. దగ్గు, ఆస్తమా సమస్యల నివారణతోపాటు దంతాలను శుభ్రపరిచేందుకు ఈ మొక్కను వినియోగిస్తారు.

బదరీపత్రం (రేగు)



ఈ మొక్క శాస్త్రీయ నామం జిజిఫస్ మారిటియన. ఇది రామినేసి కుటుంబానికి చెందిన మొక్క. చర్మ సమస్యలు, మలబద్ధకం, విరేచనాల నివారణకు వాడుతారు.

విష్ణుక్రాంత పత్రం (నీలపుష్పి)



ఈ మొక్క శాస్త్రీయ నామం ఇవాల్వులస్ అల్సినాయిడిస్. ఇది కన్వాల్వలేసి కుటుంబానికి చెందినది. దీనిని నిద్రలేమి, దగ్గు, జ్వరం, విరేచనాలు, కడుపునొప్పి, గాయాలు మానేందుకు వినియోగించడం జరుగుతుంది.

గణికాపత్రం (కామంచి)



ఈ మొక్క శాస్త్రీయ నామం సోలానం వర్జినియానం. ఇది సొలనేసి కుటుంబానికి చెందిన మొక్క. దగ్గు, జ్వరం, తలనొప్పి, ఆస్తమా, అతిమూత్ర వ్యాధి నివారణకు ఈ మొక్క ఆకులు బాగా పనిచేస్తాయి.

శమీపత్రం (జమ్మి)



ఈ మొక్క శాస్త్రీయ నామం ప్రసాఫిస్ సినరేరియా. ఇది మైమోసేసి కుటుంబానికి చెందిన వృక్షజాతి. నోటి సంబంధ వ్యాధులను తగ్గించడంలో జమ్మి పత్రం బాగా పనిచేస్తుంది.

అశ్వత్థపత్రం (రావి)



ఈ మొక్క శాస్త్రీయ నామం ఫైకస్ రెలిజియోస. ఇది మొరేసి కుటుంబానికి చెందిన వృక్ష జాతి. వీటి ఆకులను చర్మ నివారణకు వినియోగిస్తారు.

అర్కపత్రం (జిల్లేడు)



ఈ మొక్క శాస్త్రీయ నామం కెలాట్రోపిస్ జైగాన్షియా. ఈ మొక్క ఆకులను నరాల బలహీనత, చర్మవ్యాధుల నివారణకు వినియోగిస్తారు.

ఆరోగ్యపరంగా ప్రయోజనకరం



ఈ 21 రకాల ఔషధ మొక్కలను గణేష చతుర్థిరోజునే కాకుండా మానవ సంబంధిత అనారోగ్య సమస్యలకు సైతం డాక్టర్ వద్దకు వెళ్లే అవసరం లేకుండా ఔషధంగా వినియోగించవచ్చు. ఈ మొక్కల కషాయాన్ని లేదా మొక్కల పొడిని సేవించడం వల్ల అనేక అనారోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

- డాక్టర్ నాగిరెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్కేయూ

బౌలర్లదే హవా

తొలిరోజే 14 వికెట్లు
నిరాశపరచిన స్టార్లు
దులీప్ ట్రోఫీ మ్యాచ్



కిక్కిరిసిన స్టేడియం



అక్షర్ పటేల్



యువత.. కేరింత..

ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకున్న అక్షర్ పటేల్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 5: నగరంలోని ఏసీజీ గ్రౌండ్‌లో గురువారం ప్రారంభమైన దులీప్ ట్రోఫీలో బౌలర్లు సత్తాచాటారు. ఇండియా సీ-ఇండియా డీ జట్ల మధ్య పోటీ సాగింది. ఇండియా సీ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఇండియా డీ జట్టు 164 పరుగులకే కుప్పకూలింది. బౌలర్లు విజయ్‌కుమార్ వైశాక్ 3, అన్షుల్ కాంబోజ్ 3, హిమాన్షు చౌహాన్ 2, మనవ్ సుతార్, హృతిక్‌షోకిన్ చెరో వికెట్ తీశారు. ఓపెనర్లు అథర్వటైడ్(4), యశ్‌దుబే(10) తక్కువ స్కోరుకే ఔటయ్యారు. తరువాత క్రీజ్‌లోకి వచ్చిన రిక్కీబూయ్(4), కేఎస్‌భరత్(13), శ్రేయాస్ అయ్యర్(9), శరాన్ష్‌జైన్(13) తక్కువ స్కోర్‌కే ఔట్‌కాగా దేవదత్ పడిక్కల్, హర్షిత్‌రాణా డకౌట్ అయ్యారు. అయితే 7వ నెంబర్ బ్యాట్స్‌మన్‌గా బరిలోకి దిగిన అక్షర్‌పటేల్ తొలుత నెమ్మదిగా ఆడినా తరువాత చెలరేగాడు. 118 బంతులను ఎదుర్కొన్న అక్షర్‌పటేల్ 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 86 పరుగుల చేసి జట్టును కీలక సమయంలో ఆదుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇండియా సీ జట్టు 91 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయింది. తొలిరోజు ఆటముగిసే సమయానికి ఇంద్రజిత్ (15), అభిషేక్ పోరెల్ 32 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. జట్టు కెప్టెన్, ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ 5 పరుగులకే ఔటయ్యాడు. సాయిసుదర్శన్ 7 పరుగులు, ఆర్యన్ జుయల్ 12 పరుగులు, రజిత్ పటిదార్ 13 పరుగులకు పెవిలియన్‌బాట పట్టారు. ఇండియా డీ బౌలర్లలో హర్షిత్‌రాణా, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

కిక్కిరిసిన స్టేడియం

ఏసీజీ అభిమానులతో కిక్కిరిసింది. భారత జట్టు మేటి ఆటగాళ్లు ట్రోఫీలో ఆడుతుండటంతో చూసేందుకు యువత ఎగబడ్డారు. పోలీసులు గట్టి బందోబస్తు కల్పించారు. పాసులు ఉన్న వారిని మాత్రమే లోనికి అనుమతించారు. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంచోఫెర్రర్, ప్రతినిధి సతీష్, ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు షాబుద్దీన్, పడగాల మల్లికార్జున, ఏజేపీ తీర్థ, సాయికృష్ణ, మచ్చా రామలింగారెడ్డి, పీఎల్ ప్రకాష్ రెడ్డి, మధు ఆచారి, మీడియా కోఆర్డినేటర్ తిమ్మప్ప, ఏసీఏ మీడియా మేనేజర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అర్షదీప్ సింగ్ బౌలింగ్



డ్రింక్స్ బ్రేక్..

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు

కొత్తచెరువు, సెప్టెంబరు 5: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్‌స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) దరఖాస్తు గడువును ఈనెల 17వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులో ఉన్న విధంగా పేరు, పుట్టిన తేదీ, తండ్రిపేరు దరఖాస్తులో విద్యార్థులు పొందుపరచాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. డీఎస్‌ఈ.ఏపీ. జీఓవీ.ఇన్‌లో కాని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పొందవచ్చన్నారు.

జపాన్‌లో ఉద్యోగావకాశాలు

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌డీ) నావిస్ హెచ్ ఆర్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన విద్యార్థులకు జపనీస్ బాష ఎన్ 5, ఎన్ 3 స్థాయిల్లో నేర్పించి ఆ దేశంలో నర్సులుగా ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ నావిస్ హెచ్‌ఆర్ బెంగళూరులో ఆరు నెలలపాటు ఉంటుందన్నారు. ఉద్యో గ అవకాశం వచ్చిన వారికి సదుపాయాలను ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ నావిస్ హెచ్‌ఆర్ పర్యవేక్షిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు చైతన్యకుమార్ రాజు 9398643930, టోల్‌ఫ్రీ నెంబరు 9988853335 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నీటి కుంటలో పడి విద్యార్థి మృతి

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 5: మండలంలోని రాయలప్పదొడ్డి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మణికంఠ (13) వ్యవసాయ తోటలో ఉన్న నీటికుంటలో పడి మృతిచెందాడు. గురువారం ఉదయం ఆ విద్యార్థి పాఠశాలకు వెళ్లాడు. మధ్యాహ్న భోజనం అనంతరం పాఠశాలకు దూరంలో ఉన్న ఓ వ్యవసాయ తోటలోకి బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ నుంచి నీటికుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. నీటికుంట వద్ద చెప్పులు ఉండటాన్ని గమనించిన మేకల కాపరులు సమీప తోటలో పనిచేస్తున్న కూలీలు, రైతులకు సమాచారాన్ని అందించారు. వారు వచ్చి చూసి గ్రామస్థులకు తెలియజేశారు. వారు అక్కడకు చేరుకుని మృతిచెందింది మణికంఠగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు మృతదేహాన్ని పాఠశాల వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతోనే చనిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టమోటా కిలో రూ.30

అనంతపురంరూరల్, సెప్టెంబరు 5: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 3వేల టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.10పలికినట్లు ఆయన తెలిపారు.

హాకీ రాష్ట్ర జట్టుకు ధర్మవరం క్రీడాకారులు

ధర్మవరం, సెప్టెంబరు 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హాకీజట్టుకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్టు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు, జిల్లా జనరల్ సెక్రటరీ బంధనాథం సూర్యప్రకాశ్ తెలిపారు. హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 9వతేదీ నుంచి 19వ తేదీవరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో 14వ పురుషుల జాతీయ జూనియర్ హాకీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు మహబూబ్‌బాషా, మహమ్మద్‌రఫీ ఎంపికయ్యారన్నారు. వీరిని బంధనాథం సూర్యప్రకాశ్‌తోపాటు సత్యసాయిజిల్లా గౌరవాధ్యక్షుడు బండవేణుగోపాల్, పల్లె ంవేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఉడుముల రామచంద్ర, గౌరీప్రసాద్, మహమ్మద్ అస్లాం, కోశాధికారి అంజన్న, జాయింట్ సెక్రటరీ అరవింద గౌడ్, చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

ఎంపిక ప్రక్రియ పూర్తి

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 5: అంబేడ్కర్ గురుకులాల్లో అదనపు సీట్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా పూర్తయినట్లు ఆ గురుకులాల ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు సీట్లకు సంబంధించి 6, 7, 8వ తరగతులకు 561 దరఖాస్తులు రాగా 513 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. మెరిట్ సాధించిన విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. 8 అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, డీసీఓ కార్యాలయంలోని నోటీసు బోర్డులలో ఎంపికైన విద్యార్థుల జాబితాను ఉంచడం జరిగిందన్నారు. 5వ తరగతి సీట్లకు సంబంధించి ఇదివరకు జరిగిన బ్రాగ్‌సెట్ ప్రవేశ పరీక్ష మెరిట్ జాబితాలోని తదుపరి విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఆ విద్యార్థులు ఈనెల 9వ తేదీలోపు పాఠశాలల్లో చేరాలన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించండి

సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు

కూడేరు, సెప్టెంబరు 5: సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల్లో పనిచేస్తున్న కార్మికులకు వేలనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈ పథకాలకు సంబంధించి ఉమ్మడి జిల్లాల్లో పనిచేస్తున్న కార్మికులు బుధవారం అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. వీరి సమ్మెకు సీఐటీయూ మద్దతు తెలిపింది. పీఏబీఆర్ డ్యాంలోని ప్లాంట్ల వద్ద జరిగిన నిరసనలో ఓబులు, నాగేంద్రకుమార్ మాట్లాడుతూ సత్యసాయి, శ్రీరామిరెడ్డి, సీపీడబ్ల్యూ పథకాలకు సంబంధించి 572 మంది, 600 మంది, 700 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరికి ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. పీఎఫ్ చెల్లించలేదని మండిపడ్డారు. ఆందోళన చేసిన సమయంలో హామీలు ఇస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో పరిష్కారం కావడంలేదన్నారు. ఇటీవల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించారన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

సకాలంలో ఎరువులు

సరఫరా చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 5: జిల్లాకు కేటాయించిన మేరకు సకాలంలో ఎరువులు సరఫరా చేయాలని పలు కంపెనీల ప్రతినిధులను జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 111854 మెట్రిక్ టన్నుల పలు రకాల ఎరువులు కేటాయించడం జరిగిందన్నారు. ఇప్పటి దాకా 124865 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేశారన్నారు. ఇందులో యూరియా 35467 మెట్రిక్ టన్నులు, డీఏపీ 17145, ఎంఓపీ 10743, కాంప్లెక్స్ ఎరువులు 54789, ఎస్ఎస్‌పీ 6575 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయ్యాయన్నారు. ఈ నెలలో యూరియా, డీఏపీ సరఫరా చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో వరి, పప్పుశనగ పంటలు సాగు చేసే అవకాశం ఉన్నందున తగిన ఎరువులు సరఫరాను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపురం ఏడీఏ రవి, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, టెక్నికల్ ఏఓ బాలూనాయక్, పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటిని అందించండి

● కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, ద్విసభ్య కమిటీ సభ్యులు

శింగనమల సెప్టెంబరు 5: నియోజకవర్గంలో సాగు, తాగునీటికి సమస్యల లేకుండా చూడాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. దీనిపై కలెక్టర్ వినతి పత్రం అందజేశారు. గురువారం కలెక్టర్ వినోద్‌కూమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేతో పాటు ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలంనరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి హెచ్చెల్సీ ద్వారా చెరువులు, కుంటలకు నీటితో నింపాలని కోరారు. గ్రామల్లో రోడ్లుకు, డ్రైనేజ్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆలంవెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే విరాళం: వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తన నెల జీతాన్ని విరాళంగా అందజేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విజయవాడ వరదబాధితులకు త న వంతు సాయంగా నెల జీతాన్ని అందజేసి మానవత్వం చాటుకున్నారు.

వరద బాధితులకు సహాయ చర్యలపై ఆరా



వరద ప్రభావిత కాలనీలో పర్యటిస్తున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 5: విజయవాడ వెస్ట్ నియోజకవర్గం పరిధిలోని 42వ డివిజన్‌లో వరద బాధితులకు సహాయక చర్యలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆరా తీశారు. గురువారం విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలోని 42వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. స్థానిక ప్రజలతో వరద సహాయక చర్యలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే ఫిర్యాదుల విభాగం సెల్ నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు. టీడీపీ నాయకులు నటేష్ చౌదరి, దేవళ్ల మురళీ, గోపాల్ గౌడ్, రామాంజనేయులు, శేఖర్‌నాయుడు, రవి చౌదరి, పరిమి బాబు, మహేష్, సున్నం శ్రీనివాసులు, వడ్డే మురళీ పాల్గొన్నారు.

మట్టి వినాయకుల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 5: వినాయక చవితిని పురస్కరించుకుని శ్రీకృష్ణ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో గురువారం పాతూరులో 500 మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు తిరువీదుల జగదీష్, యువజన సంఘం అధ్యక్షుడు ధూపకుంట్ల శబరి వరప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరై మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. గోవింద సేవా సంఘం అధ్యక్షుడు ఈరంటి రమణ, ప్రసాద్, రఘు, రాజేష్, వెంకటస్వామి, రమేష్, విజ్జి, నామాశక్తి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎస్కేయూ ఉద్యోగుల దాతృత్వం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 5: ఎస్కేయూలో టైంస్కేల్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులు వారి దాతృత్వాన్ని చాటారు. ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న తోటి ఉద్యోగి సాకే చంద్రాయుడు మరణించడంతో బాధిత కుటుంబానికి వారి ఒకరోజు వేతనం ప్రకటించారు. గురువారం వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.47690 నగదును అందజేశారు. కార్యక్రమంలో టైంస్కేల్ ఎంప్లాయిూస్ అసోసియేషన్ నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, సంజీవప్ప, రమేష్, నారాయణప్ప, హనుమంతప్పతో పాటు బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, శివ శంకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాపు అరాచకాలపై ఫిర్యాదు చేస్తాం

● మైనింగ్ క్రషర్స్ అసోసియేషన్ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 5: తమ కార్యకలాపాలకు అడ్డు తగులుతూ, దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేస్తున్న రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అరాచకాలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని మైనింగ్ క్రషర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అనంతపురం నగరంలోని ఓ హోటల్‌లో మైనింగ్ క్రషర్స్ అసోసియేషన్ సభ్యు శ్రీమన్నారాయణ తదితరులు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కాపు రామచంద్రారెడ్డి వేధింపులు, కక్షసాధింపులు తట్టుకోలేకపోతున్నామని అన్నారు. మొదట అన్నం పెట్టి కడుపు నింపుతున్న ఓఎంసీని సర్వనాశనం చేశాడని, అక్రమ సంపాదనను కాపాడుకునేందుకు కాంగ్రెస్‌లో చేరాడని అన్నారు. ఆ తరువాత వైసీపీలో చేరి పదవి, అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరాచకాలు చేశాడని విమర్శించారు. ఇప్పుడు బీజేపీలో చేరి కూటమి ప్రభుత్వం పేరిట మైనింగ్ వ్యాపారులను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాయదుర్గం ప్రాంతంలో తాము నిర్వహిస్తున్న కంకర, ఇతర క్వారీల వద్దకు కాపు రామచంద్రారెడ్డి పంపుతున్నారని, కాలుష్యం పేరిట బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పదిహేనేళ్లుగా లేని కాలుష్యం ఇప్పుడే కనిపిస్తోందా అని ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని రూ.200 కోట్లు అక్రమార్జనకు పాల్పడ్డాడని, కాపు అక్రమాలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ఫిర్యాదు చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఇబ్బంది ఎదురుకావడం లేదని, అన్ని రకాల పన్నులను సక్రమంగా చెల్లిస్తున్నామని అన్నారు. కాపు రామచంద్రారెడ్డి నుంచి కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీజేపీ నాయకులపై కేసు కొట్టివేత

అనంతపురం సెంట్రల్, సెప్టంబరు 5: గత వైసీపీ ప్రభుత్వంలో అంతర్వేది రథం ఘటనపై ధర్నా చేసిన బీజేపీ నాయకులపై పెట్టిన కేసును గురువారం జిల్లా జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కొట్టివేసింది. రథం తగలబెట్టిన ఘటనపై 2021లో క్లాక్‌టవర్‌వద్ద బీజేపీ ధర్నా చేసింది. దీనిని ఖండిస్తూ అప్పటి ప్రభుత్వం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుతోపాటు 16మందిపై కేసును నమోదుచేశారు. పూర్వపరాలు పరిశీలించి న్యాయాధికారి తగిన సాక్ష్యాధారాలు లేవంటూ కొట్టివేశారు.

ఎంహెచ్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా చీమల నల్లప్ప

శింగనమల, సెప్టెంబరు 5: మాదిగ హక్కుల పరిరక్షణ సమితి నియోజకవర్గ అధ్యక్షుడిగా చీమల నల్లప్పను నియమించారు. గురువారం స్థానిక రామస్వామి ఆలయంలో సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా నాగన్న నియోజకవర్గ అధ్యక్షుడిగా చీమల నల్లప్పను నియమించారు. వారు మాట్లాడుతూ మాదిగలను ఆర్థిక, విద్య, సామాజిక రంగాలలో బలోపేతం కృషి చేస్తామన్నారు. ఆదెప్ప, నారాయణ, వెంకటస్వామి పాల్గొన్నారు.

వచ్చిందే అడ్డదారి..!

- గతంలో ఆ అధికారిపై పలువురు కోర్టుకు వెళ్లిన వైనం
- ప్రస్తుతం అనంత జిల్లాలో ఓ డివిజన్‌లో విధుల నిర్వహణ
- జిల్లాస్థాయి పదోన్నతి కోసం తీవ్ర ప్రయత్నాలు
- ఇదీ బీసీ సంక్షేమశాఖలో ఓ పర్యవేక్షణాధికారి తీరు

పైగా పదోన్నతి కోసం పాకులాట..!



అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 5: బీసీ సంక్షేమశాఖలో ఓ అధికారి తీరు ఆ శాఖలోని పలువురు ఉద్యోగులను ఇబ్బందుల పాలు చేసింది. ఆ అధికారి ఉద్యోగంలో చేరేందుకు వచ్చిందే అడ్డదారి... అయినప్పటికీ జిల్లా, రాష్ట్రస్థాయిలోని కొందరు అధికారుల ప్రోత్సాహంతో అంచలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం ఓ డివిజన్‌ను పర్యవేక్షించే స్థాయికి చేరుకున్నారు. ప్రస్తుతం ఆ అధికారి జిల్లాస్థాయి పదవిపై కన్నేశారు. ఇంకే ముంది ఉద్యోగం పొందిన నాటి నుంచి ఇప్పటి వరకూ పలు రకాల సీనియార్టీ జాబితాలను తయారు చేసుకొని అందరికంటే తానే సీనియర్... తనకే ముందుగా పదోన్నతి కల్పించాలని ఆ శాఖలోని అధికారుల వద్ద పైరవీలు సాగిస్తున్నట్లు సమాచారం. సీనియార్టీ జాబితాలో ఆ అధికారి కన్నా ముందున్న తన తోటి ఉద్యోగులు ప్రశ్నిస్తే... ఆ ఉద్యోగులపై తానే సీనియర్ నంటూ కోర్టు మెట్లెక్కి ఇబ్బందుల పాలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు బాధిత ఉద్యోగులు సైతం ఆ అధికారి తీరుపై ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులకు మొర పెట్టుకున్నట్లు సమాచారం. ఆ మేరకు గతేడాది అక్టోబరు నెలలో శాఖలోని రాష్ట్రస్థాయి అధికారులు తుది సీనియార్టీ జాబితాను విడుదల చేశారు. అందులో ఆ అధికారి తన తోటి ఉద్యోగులకంటే వెనుకబడి ఉన్నట్లు సమాచారం. ఇక్కడే ఆ అధికారి తనకెక్కడ పదోన్నతి రాదోనన్న దురుద్దేశ్యంతో సీనియార్టీ లిస్టులో తనకన్నా ముందున్న వారిని పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం.

అడ్డదారిలో వచ్చి..

అధికారంతో పాకులాడుతున్న ఆ అధికారి ఉద్యోగం చేరడమే అడ్డదారని ఆ శాఖలోని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. 1992 సంవత్సరంలో ఆ అధికారితో మరో 09 మంది దాకా జిల్లాలో వార్డెన్ల ఉద్యోగాలు పొందారు. అయితే అప్పుడున్న నిబంధనల మేరకు ఏ జిల్లా వారు ఆ జిల్లాలోని పరీక్షలు రాసి ఉద్యోగాలు కల్పించాల్సి ఉందనే వాదన ఆ శాఖ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఆ సమయంలో రాయలసీమ జిల్లాలోని ఓ జిల్లాకు చెందిన ఈ అధికారి అనంతపురం జిల్లాలో ఓ ఫేక్ అడ్రస్‌తో పరీక్షలు రాసినట్లు సమాచారం. అయితే అప్పట్లో బీసీ సంక్షేమశాఖ అధికారులు సైతం గుడ్డిగా ఉద్యోగంలో చేరే సమయంలో ఆ అధికారి అనంత జిల్లా అడ్రస్ మీదునే ఉద్యోగం ఇచ్చేశారు. ఇక్కడే ఆ సమయంలో పరీక్షలు రాసిన అభ్యర్థులు, ఉద్యోగంలో చేరిన జిల్లాకు చెందిన వార్డెన్లు కోర్టు మెట్టెక్కారు. అన్నింటిని పరిశీలించిన కోర్టు ఏ జిల్లాలో వారికి ఆ జిల్లాలో ఉద్యోగాలు కల్పించకుండా పక్క జిల్లా వారికి ఉద్యోగాలు ఎలా కల్పిస్తారని మొట్టికాయ వేసింది. ఆ శాఖ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు... కోర్టు ఇచ్చిన స్టేలో ఉద్యోగ నియామకంలో పక్క జిల్లాల వారిని తొలగించాలని ఆదేశించినట్లు సమాచారం. అయితే బీసీ సంక్షేమశాఖ రాష్ట్రస్థాయిలోని కొందరు అధికారులు... ఉద్యోగాల నుంచి తొలగిస్తే మొత్తానికే మోసం వస్తుందనుకున్నారోఏమోగానీ కోర్టు ఇచ్చిన ఆదేశాలు దిక్కరిస్తూ సపరేటుగా ఓ జీవోను విడుదల చేస్తూ ఏ జిల్లా వారు ఆ జిల్లాకు వెళ్లిపోవాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఆ అధికారి తన సొంత జిల్లాకు వెళ్లిపోయింది. అక్కడే విధులు నిర్వహిస్తూ గ్రేడ్-1 ప్రమోషన్ తెచ్చుకున్నారు. అక్కడి నుంచి ఓ డివిజన్ పర్యవేక్షించే అధికారి స్థాయికి ఎదిగారు. పదోన్నతిలో భాగంగా మళ్లీ అనంత జిల్లాకు వచ్చేశారు. ప్రస్తుతం ఆ అధికారి ఆ శాఖను శాసించే పోస్టులో కూర్చోవాలని యోచిస్తున్నట్లు సమాచారం.

తోటి ఉద్యోగులకు ఇబ్బందులు..

అడ్డదారిలో ఉద్యోగం పొందిన ఆ అధికారి తన పదోన్నతికి అడ్డొస్తున్నారనే క్రమంలో సీనియార్టీ లిస్టులో తనకంటే ముందున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఎవరైతే ఆ అధికారి కంటే ముందు సీనియార్టీ, ఉద్యోగ నియామకం తదితర వివరాలను జిల్లా అధికారులకు నివేదిస్తారో ఆ సమయంలో ఆ అధికారి వేధింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. అంతేకాకుండా లేనిపోని ఆటంకాలు సృష్టించి కోర్టును ఆశ్రయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధిత ఉద్యోగులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా... ఆ శాఖలోని అధికారులు తమకేమీ తెలియదన్నట్లు కళ్లుమూసుకొని వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎమ్మెల్యే చొరవతో బండమీదపల్లి చెరువుకు నీరు

రాప్తాడు, సెప్టెంబరు 5: ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో బండమీదపల్లి చెరువుకు నీరు చేరాయని మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు గురువారం బండమీదపల్లి చెరువుకు చేరడంతో నాయకులు, రైతులు నీటికి గంగ పూజ చేశారు. వారు మాట్లాడుతూ చెరువుకు నీరు వచ్చే పిల్ల కాలువలో పూడిక మట్టి, కంపచెట్లను ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి సహకారంతో తొలగించడంతో కృష్ణా జలాలు కనగానపల్లి, బండమీదపల్లి, లాలాసాహెబ్‌పల్లి చెరువులకు సరఫరా అవుతున్నాయన్నారు. రైతులకు మేలు చేయడంలో పరిటాల కుటుంబం ముందుంటుదన్నారు. చెరువుకు నీరు విడుదల అయ్యేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్యాం కుమార్, వెంకట్రాముడు, రాజేంద్ర, చెన్నారెడ్డి, పక్కీర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు సుధాకర్, నరేష్, డీలర్ నారాయణస్వామి, శివయ్య పాల్గొన్నారు.



బండమీదపల్లి చెరువు వద్ద గంగ పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

తరగని నిధి విద్య: వీసీ

అనంతపురం సెంట్రల్, సెప్టంబరు 5: ప్రపంచంలో తరగని జ్ఞాన నిధి విద్య అని జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రొఫెసర్ క్రిష్టయ్య, ఫార్మసీలో ప్రొఫెసర్లు సోమశేఖర్‌రెడ్డి, మాధురి వర్సిటీ ప్రిన్సిపాల్స్ నవీన్ కిలారి, మధుసూదనశెట్టి, రంగనాయకులు, సమత నాయుడు ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, ఉమెన్ విభాగంలో ఉమామహేశ్వరి, త్రివేణి. ఎన్ఎస్ఎస్ పీఓలు మహేశ్వరమ్మ, సురేష్ బాబు, వలంటీర్లు అశోక్‌నాయక్, నిరీషకు అవార్డులు అందజేశారు. అలాగే ప్రొఫెసర్‌లు సుదర్శనరావు, వైశాలి గోర్పాడే, శశిధర్, అరుణమస్తాని, మురళీ నాయక్‌లు అవార్డులను అందుకున్నారు. అలాగే ఎస్కేయూలో ఉత్తమ ప్రొఫెసర్‌లు జీవీ రమణ, కె.రామగోపాల్‌ను వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు ఘనంగా సన్మానించారు. సెంట్రల్ యూనివర్సిటీలో రిటైర్ ప్రిన్సిపాల్ పి.రమేష్ నాయణను వీసీ ఎస్ఏ కోరి, డీన్ షీలా రెడ్డి, ప్రొఫెసర్ రామిరెడ్డి సత్కరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డిని ఎస్‌బీఐ మేనేజర్లు సందీప్, హిమంషుషైనీ సన్మానించి సర్వేపల్లి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్ నాయుడు సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించి కేక్‌ను కట్‌చేశారు.



ఉత్తమ అధ్యాపకులతో జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్



ఎస్కేయూ ప్రొఫెసర్ రామగోపాల్‌ను సత్కరిస్తున్న వీసీ అనిత



రిటైర్డ్ ప్రిన్సిపాల్ రమేష్‌నారాయణను సన్మానిస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ వీసీ కోరి

వరదను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

అనంతపురం సెంట్రల్, సెప్టంబరు 5: భారీవర్షాలతో రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన వరదను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆర్ఈఎఫ్ రాయలసీమ అధ్యక్షుడు డాక్టర్ ఎంబీ నాగభూషణం గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రటన ద్వారా డిమాండ్‌చేశారు. ముఖ్య చంద్రబాబు స్వీయ పర్యవేక్షణలో బాధితులకు సహాయ, సహకారాలందిస్తున్నా వైసీపీ పెడబొబ్బలు పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజలు వైసీపీని సమాజిక బహిష్కరణ చేసేరోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురంరూరల్, సెప్టెంబరు 5: విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్-2 డీఈఈ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జనచైతన్య కాలనీ, ఐలమ్మకాలనీ, బళ్లారి రోడ్డు, జనశక్తి నగర్, ప్రశాంతినగర్, నారాయణపురం, ఎం.జి.పెట్రోల్ బంక్, పీటీసీ, మొదటి, రెండో రోడ్డు పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొనసాగుతున్న సత్యసాయి తాగునీటి కార్మికుల సమ్మె

నార్పల, సెప్టెంబరు 5: సత్యసాయి తాగునీటి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ బీ పప్పూరు పంప్ హౌస్ వద్ద చేపట్టిన సమ్మె గురువారం 15వ రోజుకు చేరింది. కార్మికులు మాట్లాడుతూ సమ్మెతో 1300 గ్రామాల ప్రజలకు తాగునీరు అందక ఇబ్బంది పడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. నీటి పథకంలో పనిచేసే వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మికులు శ్రీరాములు, చంద్రమోహన్, నరసింములు, ధనుంజయ, నాగభూషణ, ఈశ్వరయ్య, శివశంకర్, అంకన్న, పుల్లనాయుడు, శరత్‌బాబు పాల్గొన్నారు.

గార్లదిన్నె: బకాయి వేతనాలు చెల్లించాలని సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె గురువారానికి 15వ రోజుకు చేరింది. సత్యసాయి బాబా చిత్రపటానికి వినతి పత్రాన్ని అందచేసి నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని రెండువారాల నుంచి కార్మికులు నిరసన తెలియజేస్తున్నా ప్రాజెక్టు అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడం బాధాకరమన్నారు. నాగభూషణం, మల్లరాయుడు, శ్రీనివాసులు, శంకర్, సాంబశివ, నాగేశ్వరరావు, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



బి.పప్పూరులో పంపుహౌస్ వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

జ్వర పీడితుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపండి

● సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 5: చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన జ్వర పీడితుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి వైద్యసేవలు అందించాలని డాక్టర్లకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం చాంబర్‌లో ఆర్ఎంఓలు, ఎమర్జెన్సీ విభాగం హెచ్ఓడీ, డాక్టర్లతో సూపరింటెండెంట్ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో ఎంతమంది జ్వరబాధితులు అడ్మిషన్‌లో ఉన్నారు, వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, ఎమర్జెన్సీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాసులు స్పందిస్తూ ఆస్పత్రిలో ప్రస్తుతం 80 మంది జ్వరబాధితులు చికిత్సపొందుతున్నారని ఇందులో 44 మంది చిన్నపిల్లల వార్డులో ఉండగా మిగిలినవారు పెద్దల వార్డులో ఉన్నారని వివరించారు. వీరిలోకూడా 5 డెంగీ కేసులు ఉన్నట్లు తెలిపారు. దీనిపై సూపరింటెండెంట్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైరల్ ఫీవర్స్ కేసులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఈ వ్యాధుల నియంత్రణ విషయంలో సీరియస్‌గా ఉందన్నారు. ఆస్పత్రిలో అవసరమైన మందులు ఉన్నాయని, అలాంటపుడు జ్వర బాధితుల విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా వైద్యం అందించాలన్నారు.



వైద్యులతో చర్చిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

సమాజానికి వెలుగు.. ఉపాధ్యాయుడు



రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కిష్టప్పను సన్మానిస్తున్న పెన్షనర్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 5: సమాజానికి వెలుగు ఉపాధ్యాయుడని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ అన్నారు. గురువారం పెన్షనర్స్ భవన్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దనగౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు సమాజానికి వెలుగు నింపితే... వైద్యుడు సమాజంలో ఉన్న జనులకు ఆరోగ్యాన్ని చేకూరుస్తారన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు కిష్టప్పను ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, రిటైర్డ్ డీఆర్వో రఘునాథ్, సంఘం కోశాధికారి రామకృష్ణ, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు వెంకటరమణ, అసోసియేట్ ప్రెసిడెంట్ ఖలందర్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురంరూరల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కక్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను టీడీపీ నాయకులు సన్మానించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులకు శాలువ, పూలమాలతో సత్కరించారు. బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు నారాయణస్వామి, టీడీపీ నాయకుడు బండి నరసింహులు, వెంకటేశ్వర్లు, అన్వర్ పాల్గొన్నారు.



ఎస్వీఐటీలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

రాప్తాడు: మండలంలోని హంపాపురం వద్దనున్న శ్రీ వెంటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చేది గురువు మాత్రమేనన్నారు. ఎండీ వెన్నపూస రమాకాంతరెడ్డి, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, ఏఓ శివారెడ్డి పాల్గొన్నారు.



గుమ్మేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీచర్లు

శింగనమల: మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గమ్మేపల్లి, నాగులగుడ్డంతండా, సలకంచెరువు తరిమెల పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సూపర్‌వైజర్లు కౌసల్య, ధనలక్ష్మి, నాగలక్ష్మి, లక్ష్మి, రోగమ్మ, జయలక్ష్మి, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

నవభారత్ స్కూల్‌లో...



గురుపూజోత్సవాల్లో ఉపాధ్యాయులు

అనంతపురం కల్చరల్: ఆజాద్‌నగర్‌లోని నవభారత్ పాఠశాలలో గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్ చేతులమీదుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి, జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించడంతోపాటు జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత రాష్ట్రపతిగా ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ లోకానికి ఆదర్శప్రాయులన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోండి

గార్లదిన్నె, సెప్టెంబరు 5: వినాయక చవివి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య సూచించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వినాయక మండపాలు ఏర్పాటు చేసే వారు ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని పోలీస్‌స్టేషన్ నుంచి అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదని హెచ్చరించారు. ఎస్ఐ మహమ్మద్‌గౌస్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి ధర్నా వాయిదా

అనంతపురం విద్య, సెప్టెంబరు 5: అధిక ధరలు తగ్గించాలంటూ శుక్రవారం నిర్వహించాల్సిన ధర్నాను వాయిదా వేసినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరద తీవ్రత కారణంగా వాయిదా వేసినట్లు స్పష్టం చేశారు. వరద బాధితులకు సహాయంగా నిలబడాలని సీపీఐ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు వాయిదా వేసుకున్నట్లు తెలిపారు. అలాగే వరద బాధితుల కోసం సహాయ నిధి, నిత్యావసర వస్తువులు, దుస్తులు, వంట సామగ్రి, ఇతర వస్తువులను సేకరించి రాష్ట్రానికి, కేంద్రానికి పంపాలని సీపీఐ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

మట్టి వినాయకులతో పర్యావరణం పదిలం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 5: ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను కాకుండా మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణం పదిలంగా ఉంటుందని ఆదరణ సేవా సమాజ్ ట్రస్టు అధ్యక్షుడు తాడిమర్రి లాల్‌బాషా పేర్కొన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని గురువారం ఆదరణ సేవా సమాజ్ ట్రస్టు ఆధ్వర్యంలో జ్ఞాన సరస్వతి పాఠశాల ఆవరణలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల కోసం పేర్లు నమోదు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 5: జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో 2285 మంది రైతులు 711 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ విత్తనాల కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. గురువారం నుంచి విత్తన పంపిణీ ప్రారంభించినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ప్రత్యామ్నాయ విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గార్లదిన్నె, సెప్టెంబరు 5: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ విజయ్ భాస్కర్ ప్రజలకు సూచించారు. గురువారం మండలంలోని ఇల్లూరులో వైద్య సిబ్బందితో కలసి ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డ్రైనేజీలపై పంచాయతీ కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లు, సెప్టెంబరు 5: ఆసక్తి కలిగిన రైతులు సబ్సిడీతో అందించే సూక్ష్మసేద్య పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్ సూచించారు. నాగసముద్రం గ్రామంలో గురువారం ఆయన సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరా కోసం రైతుల పేర్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1 నుంచి 5 ఎకరాల వరకూ భూమి ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీతో, 5 నుంచి 10 ఎకరాలున్న వారికి 70 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు ఇస్తామన్నారు. అలాగే స్ప్రింక్లర్లపై 1 నుంచి 5 ఎకరాల భూమి ఉన్న రైతులకు 55 శాతం సబ్సిడీ, 5 నుంచి 12.5 ఎకరాల వరకూ ఉన్న వారికి 45 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. గ్రామంలో 11 మంది రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అనంతరం స్థానిక రైతు ఆదిశేషయ్య పొలానికి వెళ్లిన ఏపీఎంఐపీ ఏపీడీ ఈ క్రాప్ నమోదు చేసి.. దాని ఆవశ్యకతను రైతులకు వివరించారు. కార్యక్రమంలో డ్రిప్, స్ప్రింక్లర్లను తయారుచేసే క్యాప్టన్, కోటారి కంపెనీల ప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకం చేపట్టాలి


రైతులకు మామిడి మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 5: పండ్ల తోటల పెంపకాన్ని రైతులు విరివిగా చేపట్టాలని టీడీపీ నాయకుడు ధర్మతేజ తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన పలువురు రైతులకు మామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకంతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్క రైతుకు పండ్ల మొక్కలను అందజేస్తోందన్నారు. సంబంధిత శాఖ అధికారులు కూడా పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి తోడ్పాటు అందించాలని సూచించారు. ఎంపీడీఓ సాల్మన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చౌళం మల్లికార్జున, టీడీపీ మండల కన్వీనర్ గోళ్ల వెంకటేశులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయండి

విడపనకల్లు, సెప్టెంబరు 5: మండలంలోని రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయాలని ఏఓ పెన్నయ్య సూచించారు. మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఆయన ఎంపీఈఓలకు, సచివాలయ సిబ్బందికి, వీఆర్వోలకు సమావేశం నిర్వహించి ఈ క్రాప్ బుకింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో జీబీసీ కీలువ కింద, హెచ్ఎల్‌సీ కింద, బోరుబావుల కింద, ఏఏ రకాల పంటలు ఎంత మేర సాగు చేశారు అనే విషయాలను రికార్డు చేయాలన్నారు. తర్వాత పూర్తి స్థాయిలో ఈ క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ పర్వతయ్య, హార్టికల్చర్ ఏఓ నెట్టికల్లు, ఏఈఓ రాఘవేంద్ర పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహం ఆవిష్కరణ

విడపనకల్లు, సెప్టెంబరు 5: మండలంలోని వేల్పుమడుగు గ్రామంలో గల మండలపరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహాన్ని గురువారం ఆ గ్రామ సర్పంచ్ తిప్పారెడ్డి, టీడీపీ నాయకులు నాగరాజు, ఎర్రిస్వామి గురువారం ఆవిష్కరించి పూజలు చేశారు. విగ్రహాన్ని సర్పంచ్ పాఠశాలలో ఏర్పాటు చేయించి .. చిన్నపాటి మందిరం కూడా నిర్మించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దగడేహోతూరులో కనకదాసు విగ్రహం..

ఉరవకొండ, సెప్టెంబరు 5: వజ్రకరూరు మండలం పెద్దగడేహోతూరులో ఏర్పాటు చేసిన కనకదాసు విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. బుధవారం రాత్రి విగ్రహాన్ని గ్రామంలోని వీధుల గుండా ఊరేగించారు. తర్వాత గురువారం ఉదయం నూతనంగా నిర్మించిన మందిరంలో ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కురుబ కులస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కణేకల్లు, సెప్టెంబరు 5: మండలంలోని మారెంపల్లి రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు గాయపడ్డారు. బ్రహ్మసముద్రానికి చెందిన ప్రకాష్, లోకేష్ కణేకల్లు నుంచి స్వగ్రామానికి బైక్‌లో వెళుతుండగా.. మారెంపల్లి గేట్ వద్ద బెణెకల్లు నుండి ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీ కొంది. ఈ ఘటనలో ప్రకాష్‌కు కాలు విరగగా.. లోకేష్ స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని బళ్లారి ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● గుత్తిలో సత్యసాయి తాగునీటి పథకం కార్మికుల ర్యాలీ


గుత్తిలో ర్యాలీ చేస్తున్న సత్యసాయి కార్మికులు


తాడిపత్రిలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుత్తి, సెప్టెంబరు 5: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు బుధవారం ర్యాలీ చేపట్టారు. స్థానిక రాజీవ్ సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ తమకు బకాయిపడ్డ ఆరు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో చేపట్టిన సమ్మె 15వ రోజుకు చేరిందని అన్నారు. తమకు ఈ బడ్జెట్ కేటాయించి పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నిర్మల, రామకృష్ణ, సత్యసాయి కార్మికుల సంఘం నాయకులు కృష్ణామాచారి, జోసఫ్, నాగభూషణం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలో సత్యసాయి తాగునీటి కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి కార్మికలకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలన్నారు. అధికారులు స్పందించి తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, రంగమ్మ, రామునాయక్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

తాడిపత్రి: పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలోని సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత ప్రభుత్వం పథకానికి నిధులు కేటాయించలేదన్నారు. జలజీవన్ మిషన్ పనులు కూడా చేయలేదని తెలిపారు. ఈ పథకానికి సంబంధించి 2023 జూలై నాటికి బడ్జెట్ కేటాయింపు జరగలేదని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్మికులు రంగనాయకులు, సునీల్‌కుమార్, విజయభాస్కర్, నరేంద్రనాథ్, పుల్లప్ప, పుల్లయ్య ఉన్నారు.

పండ్ల తోటల పరిశీలన

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 5: మండలంలోని బీఎన్ హళ్లి, ఆవులదట్ల గ్రామాల్లో రైతులు సాగు చేసి న వివిధ పండ్ల తోటలను ఏపీ ఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి నరసింహారావు గు రువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పండ్లతోటల రైతులు ఈ నెల 15వ తేదీలోగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. ఉద్యాన పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు , సస్యరక్షణ చర్యలు, చీటపీడల నివారణ గురించి వివరించారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానాశాఖ మండల అధికారి మౌనిక, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి..

యాడికి: పంటలను ఆశించిన తెగుళ్లను నివారించడానికి తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తాడిపత్రి ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి తెలిపారు. మండలంలోని రాయలచెరువులో పలువురు రైతులు సాగు చేసిన టమోట పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెగుళ్ల నివారణకు తగు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. అధిక వర్షాల వలన టమోటాలకు వేరు కుళ్లు తెగులు, ఫంగస్ వస్తోందని, వాటి నివారణకు సరిపడు మందులను పిచికారీ చేయాలని తెలిపారు. ఆమె వెంట విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ కోమలి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పవన్‌కుమార్ ఉన్నారు.

ఉత్తమ ఎంఈఓగా మల్లారెడ్డి

బెళుగుప్ప, సెప్టెంబరు 5: ఉత్తమ ఎంఈఓగా మల్లారెడ్డి అనంతపురంలో గురువారం కలెక్టర్, ప్రజాప్రతినిధుల చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. గురుపూజోత్సవం సందర్భంగా ఆయనకు అవార్డును అందించి ఘనంగా సన్మానించారు.

నీలం ప్రిస్కల్లాకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

పామిడి: మండలకేంద్రంలోని 5వ వార్డులో గల జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు నీలం ప్రిస్కల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపియ్యారు. . గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని అంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో ఆమె ఈ అవార్డును కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు.

ఘనంగా కలశ ప్రతిష్ఠ

బెళుగుప్ప, సెప్టెంబరు 5 : మండల కేంద్రంలో వినాయకుడి ఆలయ గోపురంపై గురువారం భక్తిశ్రద్ధలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కలశ ప్రతిష్ఠ చేశారు. వేదపండితులు వేద మంత్రోచ్ఛారణల నడుమ ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతకుమునుపు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కందికాపుల సచివాలయం తనిఖీ

పుట్లూరు, సెప్టెంబరు 5: మండలంలోని కందికాపుల గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ యోగానందరెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వివిధ సమస్యలపై సచివాలయాలకు వచ్చే ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని అక్కడి సిబ్బందికి సూచించారు. ఎప్పటి సమస్యలను అప్పుడే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ చెన్నకేశవులు, సిబ్బంది ఉన్నారు.

జీడిపల్లికి 1050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 5 : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం 1050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే అవుట్‌ఫ్లో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేస్ 2కు 940 క్యూసెక్కులు, మరవ నుంచి పీఏబీఆర్‌కు 70 క్యూసెక్కులు ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

ప్లాట్లు వేసిన భూముల పరిశీలన

పుట్లూరు, సెప్టెంబరు 5: మండలంలోని వ్యవసాయ భూముల్లో రియల్ ఎస్టేట్ చేస్తున్నట్లు ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు గురువారం అధికారులు స్పందించారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయ భూముల్లో రియల్టర్లు వేసిన ప్లాట్లను పరిశీలించారు. ఈ మేరకు వాటిల్లోని సర్వే నెంబర్లు సేకరించారు. నిబంధనల మేరకు పాట్లు వేశారా.. లేదా అని విచారిస్తామని, నిబంధనల మేరకు లేకపోతే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు.

దర్గాకు చాదర్ సమర్పణ

గుంతకల్లు, సెప్టెంబరు 5: పట్టణంలోని అంజుమన్ ఎ ఇస్లామియా ముస్లిం మైనార్టీల సంఘం నాయకులు గురువారం స్థానిక మస్తాన్ వలి దర్గాకు చాదర్‌ను సమర్పించారు. ఉదయం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు దర్గా వద్దకు చేరుకుని ఫాతెహా చదివింపులు చేసి చాదర్‌ను అందజేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, కార్యదర్శి వలిబాషా, నాయకులు గుజరీ మహ్మద్ ఖాజా, నూర్ మహమ్మద్, ఫ్రూట్ మస్తాన్, పజులు, మహమ్మద్ రఫీ, టెంకాయల యూసఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సీడీపీఓగా పద్మావతి



రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 5: రాయదుర్గం ఐసీడీఎస్ సీడీపీఓగా ఏఎల్ పద్మావతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటిదాకా ఉన్న సీడీపీఓ ప్రభావతమ్మ రిటైర్డ్ అయ్యారు. దీంతో ఆమె స్థానంలోకి మడకశిర నియోజకవర్గం గుడిబండ ప్రాజెక్టులో పని చేస్తున్న పద్మావతి బదిలీపై వచ్చారు. ఆమె రాయదుర్గం పట్టణంలో ఐసీడీఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇదే ప్రాజెక్టులో 1983లో అంగన్‌వాడీ కార్యకర్తగా విధుల్లో చేరిన పద్మావతి 13ఏళ్ల తర్వాత గ్రేడ్ 2 సూపర్‌వైజర్‌గా పదోన్నతి పొందారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టులలో సూపర్‌వైజర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2023లో మరోసారి పదోన్నతి పొంది సీడీపీఓగా గుడిబండ ప్రాజెక్టులో బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు రాయదుర్గంకు బదిలీ అయ్యారు.

గౌరవ వేతనాన్ని చెల్లించాలి

బెళుగుప్ప, సెప్టెంబరు 5: తమకు అందాల్సిన గౌరవ వేతనాన్ని వెంటనే అందించాలని బీఎల్‌వోలు అధికారులను కోరారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ షర్మిల బీఎల్‌వోల సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో బీఎల్వోలు మాట్లాడుతూ.. తమకు రెండేళ్లుగా వేతనం ఇవ్వకుండా డీటీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. మండలంలో 49 మంది బీఎల్‌వోలు ఉన్నామని, అందరూ వేతనం రాక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన చెందారు. వెంటనే గౌరవ వేతనాన్ని చెల్లించాలని కోరారు. ఇందుకు తహసీల్దార్ మాట్లాడుతూ.. తాను రెండు రోజుల క్రితమే బాధ్యతలు తీసుకున్నానని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 5: మండలంలోని మైలాపురం, దేవగిరి క్రాస్‌లో గురువారం శ్రీధరఘట్ట వైద్య సిబ్బంది పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్‌లు గోవర్ధన్, వెంకటరమణ మాట్లాడుతూ పౌష్టికాహారం సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. వ్యాధి నిరోధకశక్తిని పెంచుతుందని ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారమైన రాగులు, జొన్నలు, సజ్జలు, ఆలసందులు లాంటి ధాన్యాలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రామలింగాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీత తదితరులు పాల్గొన్నారు.

చవితిని ప్రశాంతంగా జరపుకోవాలి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్


మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

గుత్తి, సెప్టెంబరు 5: వినాయక చవితి పండుగను ప్రజలంతా ప్రశాంతంగా జరుపుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ సూచించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం గౌతమిపురి నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఇందులో వెంకటశివుడుయాదవ్‌తో పాటు పార్టీ గుత్తి ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ, తహసీల్దారు ఓబులేసు, సీఐ వెంకటేశులు పాల్గొన్నారు. వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగరాదన్నారు. శాంతి భద్రతలు విఘాతం కలగకుండా పండుగ జరుపుకోవాలన్నారు. మండపాల ఏర్పాటులో, నిమజ్జనం సమయంలో, ఊరేగింపులో పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిమ్మారెడ్డి, నారాయణరెడ్డి, జనసేన నాయకులు పాటిల్ సురేష్, వెంకటేష్, గౌతమిపురి నగర ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి


డిపో వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 5: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో తొలగించిన ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధిత కార్మికులతో కలిసి బుధవారం ఆయన డిపో ఎదుట అరగంట పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిపో మేనేజర్ ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దాదాపు 14 మంది కార్మికులను చిన్న చిన్న తప్పిదాల వల్ల విధుల నుంచి తొలగించి ఆరునెలలు కావస్తోందన్నారు. తర్వాత ఇంతవరకూ వారిని విధుల్లోకి తీసుకోలేదన్నారు. ఈ కార్మికులను విధుల్లోకి తీసుకోవడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కార్మికులను మేనేజర్ తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి తప్పుగా క్షమించి తక్షణమే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఇటీవల ఎమ్మెల్యే, ఎంపీ లెటర్లు పంపినా మేనేజర్ బేఖాతర్ చేశారని మండిపడ్డారు. ఈ మేనేజర్‌పై ఆర్టీసీ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, అదే విధంగా అన్యాయంగా తొలగించిన ఈ 14 మంది కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు రామాంజనేయులు, ముఖేష్, నవీన్, నవారప్ప, కుసుభ, నూర్ మహ్మద్, హనుమంతు, నరేష్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ అక్రమాలపై విచారణ


అక్రమాలపై క్షేత్రస్థాయిలో విచారిస్తున్న ఎంపీడీఓ

ఉరవకొండ, సెప్టెంబరు 5: మండలంలోని బూదగవి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులలో జరిగిన అక్రమాలపై ఎంపీడీఓ రామచంద్ర గురువారం విచారణ చేపట్టారు. అంతకుమునుపు మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామస్థులు ఉపాధి పథకంలో జరిగిన అక్రమాల వివరాలను ఎంపీడీఓకు అందజేశారు. పనులకు వెళ్లని వారిపేర్లను మస్టర్‌లో నమోదు చేసి బిల్లులు కాజేశారని తెలిపారు. అక్రమాలపైన సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఆయన ఆ డబ్బును రికవరీ చేస్తామని తెలియజేశారు. అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి పనులు పరిశీలించారు. ఫారంపాండు పనులు వంకలో చేయకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ, అక్కడ చేసినట్లు సిబ్బంది చెప్పారు. దీంతో అక్కడి నుంచే ఆ పొలానికి సంబంధించిన రైతుతో ఎంపీడీఓ ఫోన్‌లో మాట్లాడారు. పొలంలో గట్టు పనులు మాత్రమే చేయించానని, రెండేళ్ల కిందట ఫారంపాండు పనులు చేపట్టారని అధికారికి రైతు తెలిపారు. రికవరీ కూడా సాయంకాలం లోపు చేయాలని ఏపీవో, టీఏకి ఎంపీడీవో ఆదేశించారు. వాస్తవాలను సమగ్రంగా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఎంపీడీవో తెలిపారు.

వరద బాధితులకు విద్యార్థుల సాయం


హెచ్ఎంకు నగదును అందజేస్తున్న విద్యార్థులు

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 5: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం మండలంలోని చదం ప్రభుత్వ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు తాము పోగు చేసుకున్న డబ్బును హెచ్ఎం హేమలతకు గురువారం అందించారు. పాఠశాలలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు విద్యార్థులు విజయవాడలోని వరదల కోసం తమ వంతు సాయంగా రూ. 1120లను హెచ్ఎంకు అందించారు. ఈ నగదును సీఎం సహాయనిధికి జమ చేస్తున్నట్లు హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రహ్లాద, వెంకటప్ప, మహేంద్ర, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల పంపిణీ

తాడిపత్రి: విజయవాడ వరద బాధితులకు పట్టణంలోని భగవాన్ రమణ మహర్షి ఆశ్రమం, వీవీ బ్రహ్మం సేవా ట్రస్ట్ తరపున గురువారం ఆహార పదార్థాలను పంపిణీ చేసినట్లు ట్రస్ట్ కార్యదర్శి మహేష్ తెలిపారు. ఆహార పదార్థాలతో పాటు దుప్పట్లు, చీరలను అందించామన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 5: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి రమేష్ సూచించారు. పట్టణంలోని వాల్మీకినగర్‌లో గురువారం ఆయన వైద్యసిబ్బందితో కలిసి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమలు బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా 90 శాతం అంటువ్యాధులు రాకుండా చూసుకోవచ్చని చెప్పారు. ఆరోగ్య విద్యా బోధకులు ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

రైల్వే ఏరియాలోకి దారి వదలాలని వినతి

గుంతకల్లు, సెప్టెంబరు 5: రైల్వే పరిధిలో పూర్తిగా గోడను నిర్మించడంతో పట్టణవాసులకు సమస్యగా మారిందని, మున్సిపాలిటీలో ప్రజల సమస్య పరిష్కరించడానికి అడ్డుగోడను తొలగించాలంటూ టీడీపీ నాయకులు డీఆర్ఎంకు విన్నవించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు బీఎస్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు గురువారం ఉదయం డీఆర్ఎం విజయకుమార్‌ను కలిసి మాట్లాడారు. పట్టణంలో రైల్వే ఏరియాలో పూర్తిగా గోడను కట్టిన కారణంగా స్థానికులు రైల్వే స్టేషన్‌కు, పాఠశాలలకు వెళ్లడానికి దారిలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందుల పరిష్కారానికి కృషిచేయాలని, ముఖ్యమైన ప్రదేశాల్లో గోడను పాక్షికంగా తొలగించాలని కోరారు. నాయకులు తలారి మస్తానప్ప, ప్రభాకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ శిక్షణ కేంద్రం ప్రారంభం


మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ

గుత్తి, సెప్టెంబరు 5: మహిళలు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొంది స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ఇందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని టీడీపీ గుత్తి ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయ ణ సూచించారు. మున్సిపల్ పరిధిలోని చెట్నేపల్లిలో జన శిక్షణ సంస్థ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బ్యూటీషియన్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మహిళలు బ్యూటీషియన్ శిక్షణ పొంది అందులో నుంచి నైపుణ్యత సాధించాలన్నారు. అనంతరం స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. తర్వాత సీడీపీఓ ఢిల్లీశ్వరి సమక్షంలో నలుగురు గర్భిణులకు సీమంతం చేశారు. ఒక్కొక్క గర్భిణికి రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి, జనశిక్షణ సంస్థ కోఆర్డినేటర్ రషీద్, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.


ఉడేగోళంలోని డీఎస్సీ కోచింగ్ కేంద్రంలో సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


గుత్తి కోటవీధిలోని జెడ్పీ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


వజ్రకరూరులోని మోడల్‌స్కూల్‌లో సర్వేపల్లిరాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

● సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి
● ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో గల ప్రభుత్వ, ప్రై వేటు పాఠశాలలు, కళాశాలల్లో ఈ వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయు లు, అధ్యాపకులు విద్యార్థులతో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలువురు మా ట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి సరేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. ఆయన ఉపాధ్యాయ వృత్తితో జీవితాన్ని మొదలుపెట్టి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని తెలిపారు. సమాజ అభివృద్ధికి దిశానిర్దేశం చేసేది గురువులేనని పే ర్కొన్నారు. ప్రతిఒక్కరూ తల్లిదండ్రులతో స మానంగా గురువును గౌరవించాలని సూచించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు పూలమాలలు, శాలువాలతో సన్మానం చేశారు. పలు పాఠశాలు, కళాశాల్లో విద్యార్థులు గురుపూజోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గుంతకల్లు పట్టణంలోని రైల్వే ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి డీఆర్ఎం విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందిన ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదన రావును సన్మానించారు. రాయదుర్గం మండలం ఉడేగోళంలోని ఉచిత డీఎస్సీ కోచింగ్ కేంద్రంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 12 మంది సీనియర్ ఉపాధ్యాయులను ఆయన పూలమాలలు, శా లువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయుల గొప్పతనాన్ని కొనియాడారు.


కంబదూరులోని శారదా విద్యావిహార్‌లో ..


బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి ఉన్నత పాఠశాలలో..


యాడికిలోని నెంబరు-2 ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం


గుంతకల్లులోని రైల్వే పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న డీఆర్ఎం


గుంతకల్లులోని శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో ..